సవాళ్లను అధిగమించేనా..?

- కరకట్ట పరిసరాల్లో కానరాని చలువ పందిళ్లు
- తలంబ్రాల పంపిణీలో తోపులాటకు అవకాశం
- కల్యాణం అనంతరం ఏటా ట్రాఫిక్ సమస్య
- ఈసారైనా యంత్రాంగం స్పందించేనా?



గత ఏడాది భద్రాచలం సెంటర్‌లో నిలిచిపోయిన వాహనాలు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించే రామయ్య కల్యాణం(శ్రీరామనవమి) వేడుకల్లో ప్రతి ఏటా భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఈ సారి అధికారులు పరిష్కారం చూపుతారా అనే ప్రశ్న రామయ్య కల్యాణానికి వచ్చే భక్తులలో నెలకొంది. భద్రాద్రిలో తిరు కల్యాణ మహోత్సవాలను విజయవంత చేయడానికి ఆలయ, జిల్లా యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి అధికారులు సైతం భద్రాద్రి చేరుకొని ఇక్కడి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు. ఇంతవరకు భాగానే ఉన్న ప్రతి ఏటా అధికారులు మధ్య సమన్వయ లోపంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సరిపడా చలువ పందిళ్లు వేయకపోవడం, ట్రాఫిక్, తాగునీటి సమస్యలపై పూర్తి స్థాయి దృష్టి సారించకపోవడం, తలంబ్రాల పంపిణీ విషయాల్లో సమస్యలను నిలువరించలేకపోవడం వంటి సమస్యలు వస్తూనే ఉన్నాయి.

చలువ పందిళ్లు లేక అవస్థలు..

రామయ్య కల్యాణం అనంతరం భక్తులు కొదిసేపు గోదావరి అందాలను తిలకించేందుకు కరకట్టపై వెళ్లడానికి ఇష్టపడతారు. కాని ఎండలో తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు ఎటువంటి చలువ పందిళ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కరకట్ట కింద సైతం చలువపందిళ్లు ఏర్పాటు చేయకపోవడంతో కట్ట పక్కన ఉన్న చెట్ల కింద సేద తీరేవారు. ఆ సమస్యలకు ఈ ఏడాదైనా పరిష్కారం చూపుతారా అని భక్తులు సందిగ్ధంలో ఉన్నారు.

పరిపాటిగా తోపులాట..

రామయ్య తలంబ్రాలను దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడుతారు. ఈ క్రమంలో సరిపడా తలంబ్రాల పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ భక్తుల రద్దీని నిలువరించే పోలీసులే తలంబ్రాల కోసం ఎగబడిన సందర్భాలున్నాయి. అధికారులు పట్టణంలో ప్రధాన సెంటర్లతో పాటు ఆలయ పరిసరాల్లో తలంబ్రాల ఉచిత పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. కాని అక్కడి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పంపిణీ సమయంలో భక్తులకు తలంబ్రాలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ఈ సయస్యను పరిష్కరించే విధంగా ఈ ఏడాది చర్యలు తీసుకున్నారో లేదో నేడు తేలనుంది.

వీఐపీల సేవలో పోలీసులు

రామయ్య కల్యాణం ప్రారంభం వరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యే పోలీసులు తీరా...కల్యాణం అనంతరం భద్రతను గాలికి వదిలి వీఐపీల సేవలో తరించిపోతరనే ఆరోపణలు ఉన్నాయి. కల్యాణానికి వచ్చే వీవీఐపీలు, వీఐపీలను అక్కడి నుంచి సాగనంపే తరునంలో భక్తుల ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా వాహన రాకపోకలకు విఘాతం కలిగిస్తారనే విమర్శలు సైతం పోలీసులపై ఉంది. గత ఏడాది పోలీసులు ఒక్కసారిగా అందరూ కల్యాణం జరిగే మిథాలి స్టేడియం వద్దకు చేరుకొవడంతో ప్రధాన రహదారిపై గంటల తరబడి వాహనాలు నిలిచిపోవాల్సి వచ్చింది. దీంతో భక్తులు పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తెరుకున్న పోలీసులు అంబేడ్కర్ సెంటర్ నుంచి బ్రిడ్జి వరకు నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ప్రభావం చూపనున్న 'మహాలక్ష్మి'

కోవిడ్ తరువాత గత ఏడాది రామయ్య కల్యాణం ప్రత్యక్షంగా వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అధికారులు ఆ స్థాయిలో ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారనే ఆరోణలు సైతం అప్పట్లో వచ్చాయి. ఈ ఏడాది మహిళలకు మహాలక్ష్మి పథకం ఉండడంతో మహిళా భక్తులతో పాటు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. అందుకు అనుగునంగా ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా రామయ్య కల్యాణం వీక్షించి తిరిగి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటారా.. లేక గత అనుభావలను భక్తులకు గుర్తు చేస్తారా.. అనేది చూడాల్సి ఉంది.

వ్యాపారుల ఇష్టారాజ్యం

కల్యాణం వేళ మరోకొత్త సమస్య వచ్చి పడింది. భద్రాచలంలో రాముడిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడాన్ని అదునుగా భావించి, స్థానిక బస్టాండ్‌లోని వ్యాపారులు అధిక వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రతీ వస్తువు కొనుగోలుపైనా ఎమ్మార్పీకి మించి అదనంగా బాదుడుకు తెరలేపారు. కొద్ది రోజుల క్రితం ప్రయాణికుల ఫిర్యాదుతో ఉన్నతాధికారులు తనిఖీలు చేసి బస్టాండ్‌లోని షాపులలో ఎమ్మార్పీ ధరలకే ప్రతి వస్తువును విక్రయించాలని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానీ వ్యాపారులు అవేవి పట్టించుకోకుండా అధిక ధరలతో ప్రయాణికులను, భక్తులను దోచేస్తున్నారు. కల్యాణం వేళ ఈ పరిస్థితి మరింత ముదిరే అవకాశం ఉంది.

పర్ణశాలలో కల్యాణానికి సర్వం సిద్ధం



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం



కల్యాణ మండపంలో సేదతీరుతున్న భక్తులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శ్రీసీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం చేశారు. కల్యాణానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు పూర్తిచేశారు. కల్యాణం జరిగే మండపంతో పాటు ఆలయ ప్రాంగణం అంతా వస్త్రాలతో డేకరేషన్ చేశారు. కల్యాణానికి ముందే భక్తులు భారీగా పర్ణశాలకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు చేశారు. రెవెన్యూ, పంచాయతీ, పోలీస్, ఆలయ అధికారులు పర్ణశాల గ్రామంలోనే ఉంటూ శ్రీరామనవమి వేడుకల విజయవంతానికి కృషి చేస్తున్నారు. పర్ణశాల వచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు గోదావరి నదిలో ఇబ్బంది ఉండడంతో ఇరిగేషన్ జేఈ రాజ్ సుహాస్, మిషన్ భగీరథ ఏఈ రాము, సిబ్బంది గోదావరిలో 5హెచ్‌పీ మోటార్ ఏర్పాటు చేసి స్నాన ఘట్టాల వరకు పైప్‌లైన్ వేశారు. ఎండలు బాగా ఉండడంతో పంచాయతీ ఆధ్వర్యంలో మోటార్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. నవమి సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ అశోక్ ఆధ్వర్యంలో ఎస్ఐలు కేశవరావు, గణేష్, పోలీస్, సీఆర్పీఎఫ్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పలు ఆలయాల్లో..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాలను శ్రీరామ నవమి పండుగ నేపథ్యాన ముస్తాబు చేశారు. ఆయా ఆలయాలకు రంగుల వేసి, విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చలువ పందిళ్లతోపాటు టెంట్‌లు వేసి సిద్ధం చేశారు.

మణుగూరురూరల్: రామనవమి సందర్భంగా మండల పరిధిలోని రామాలయాలతో పాటు వెంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలను ఆలయ కమిటీల సభ్యులు సుందరంగా ముస్తాబు చేశారు. గ్రామాల్లో సైతం ప్రత్యేక చలువ పందిళ్లను ఏర్పాటు సీతారాముల కల్యాణానికి అన్నీ సిద్ధం చేస్తున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీడీపీఓ రోజారాణి

అశ్వారావుపేటరూరల్: బాల్య వివాహాలు చేసిన, ప్రోత్సహించిన చట్టరీత్య నేరమని అశ్వారావుపేట సీడీపీఓ రోజా రాణి అన్నారు. మంగళవారం మండలంలోని గాండ్లగూడెం గ్రామం ప్రాథమికోన్న పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలకు 18 ఏళ్లు, యువకులకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని సూచించారు. తక్కువ వయస్సులో వివాహాలు చేస్తే ఆరోగ్యపరంగా, మానసికంగా, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులకు గురి అవుతారని వివరించారు. బాల్య వివాహాలు చేస్తే తక్షణమే సమీపంలోని అంగన్‌వాడీ టీచర్లకుగాని, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, డయల్ 100కు ఫోన్ చేసిగాని సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. కార్యదర్శి నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు పద్మావతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



భద్రాచలం (భద్రాచలంటౌన్): భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్రం అధ్యాపకుడు సూరం శ్యాంప్రసాద్‌కు డాక్టరేట్ లభించింది. వృక్షశాస్త్రం అధ్యాపకురాలు డాక్టర్ పీఆర్.సుష్మ పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్‌ను ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్, వైస్ ప్రిన్సిపాల్ భద్రయ్య, అధ్యాపకులు అభినందించారు.

నీటి ఎద్దడి ఉండొద్దు

అన్నపురెడ్డిపల్లి: వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైస్ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద వైస్ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రామారావు మాట్లాడారు. సీడీపీఓ నిర్మలాజ్యోతి, ఎంఈఓ సత్యనారాయణ, వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక, విద్యుత్ ఏఈ తరుణ్, ఎంపీటీసీలు కృష్ణారెడ్డి, బొగ్గం సీతామహాలక్ష్మి, సీత, అధికారులు పాల్గొన్నారు.

డీఎస్పీ-కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం



కాంగ్రెస్ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ

భద్రాచలం(భద్రాచలంఅర్బన్): బందోబస్తు విధులు నిర్వహించేందుకు భద్రాచలం వచ్చిన కొత్తగూడెం డీఎస్పీ రెహ్మాన్‌కు భద్రాచలం కాంగ్రెస్ పార్టీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. శ్రీరామనవమి వీఐపీ పాసుల కోసం వెళ్తున్న కాంగ్రెస్ నాయకుల వాహనాన్ని డీఎస్పీ రెహ్మాన్ ఆపి, ఆ దారిలో వెళ్లడానికి అనుమతి లేదని నిరాకరించారు. సదరు కాంగ్రెస్ నాయకుడు సతీష్ తాను స్థానికుడినే అని, కేవలం వీఐపీ పాసుల కోసం మాత్రమే అటుగా వెళ్తున్నాని చెప్పాడు. అయినప్పటికి డీఎస్పీ ఒప్పుకోకపోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా డీఎస్పీ రెహ్మాన్ సదరు కాంగ్రెస్ నాయకుడు సతీష్‌పై దుర్భాషలాడుతూ.. ఛాతిపై చేయి వెసి తోసుకుంటూ వెళ్లాడు. కొద్ది సేపటి తరువాత భద్రాచలం కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బుడగం శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ నాయకులు సంఘటన ప్రాంతానికి చేరుకోవడంతో వాగ్వాదం కొనసాగింది. తక్షణమే డీఎస్పీ రెహ్మాన్ సతీష్‌కు క్షమాపన చెప్పాల్సిందిగా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. 'నేను తప్పు చేయలేదు.. చేశా అని మీరు అనుకుంటే సాక్షాధారాలతో సంబంధిత ఉన్నతాధికారులకు కంప్లెయింట్ చేసుకోవచ్చు'అని కాంగ్రెస్ నాయకులకు డీఎస్పీ సూచించారు.

పోలీస్ స్టిక్కర్ ఉంటే చాలు..

పోలీసులు శ్రీరామ నవమికి సంబంధించి వాహనాలకు పాస్ ఉంటేనే పంపిస్తున్నారు. ఇదిలా ఉండగా వాహనాలకు పోలీస్ స్టిక్కర్ ఉంటే మాత్రం వివరాలు అడగకుండానే పంపిస్తున్నారు. భద్రాచలంలో జరుగుతున్న ప్రతి వేడకలో పోలీసులు వ్యహరిస్తున్న తీరు పట్ల స్థానికులు, భక్తులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కంటి వైద్యశిబిరం



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరురూరల్: పట్టణంలోని మణుగూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల(ఏజీహెచ్ఎస్) హాస్టల్‌లో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ గోపిలాల్, నేత్రవైద్యాధికారి డాక్టర్ జి.సంజీవరావులు విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. 123మందికి కంటి పరీక్షలు చేయగా.. వీరిలో ముగ్గురికి కళ్లజోళ్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. హాస్టల్ నిర్వాహకురాలు మహాలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చక్రాలబండి అందజేత

మణుగూరురూరల్: ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తున్న చెరుకుపల్లి ఉపేందర్‌రావు ఓ యాచకుడికి నాలుగు చక్రాల చిన్న బండిని అందించి ఔదార్యం చాటుకున్నారు. రహదారిపై నడవలేని పరిస్థితితో పలువురిని యాచిస్తూ.. జీవనం సాగిస్తున్న వ్యక్తి దీన స్థితిని చూసి.. ఓ చిన్న చక్రాల బండిని తన సొంత ఖర్చులతో తయారు చేయించి సురక్షాబస్టాండ్ ప్రాంగణంలో అందజేశారు. ఆర్టీసీ సిబ్బంది, మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణానికి పట్టువస్త్రాలు



ఆలయ అర్చకులకు పట్టువస్త్రాలు అందజేస్తున్న సగర సంఘం నాయకులు

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో నిర్వహించే రామయ్య కల్యాణానికి సగర వంశస్తులైన తెలంగాణ సగర సంఘం రాష్ట్ర నాయకులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, వడి బియ్యం స్వామివారికి మంగళవారం అందజేశారు. శ్రీరాముని వంశస్థులు సగరులు హైదరాబాద్ నుంచి భద్రాచలం వరకు పాదయాత్రగా తరలివచ్చి వారు తీసుకొచ్చిన పట్టు వస్త్రాలు, తలంబ్రాలను పట్టణంలోని పురవీధుల్లో మంగళవాయిద్యాలతో ఊరేగించి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో సత్యం, రామ్, యాదాద్రి, రాములు, వెంకట్రావ్, శేఖర్, దామోదర్, విష్ణు, రవి, వెంకటస్వామి, రవి, నరసింహా, వెంకటేష్, సీతారామ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



దమ్మపేటలో సీపీఐ నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండల పరిధిలో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంగళవారం మండలంలోని పట్వారిగూడెం, జమేదారుబంజర, దమ్మపేట గ్రామాల్లో ఎమ్మెల్యే జారే పర్యటించారు. పట్వారిగూడెం గ్రామంలో నిర్వహించిన చెన్నారాయుడు స్వామి సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. జమేదారుబంజర గ్రామంలో ఇటీవలే గుండెపోటుతో మరణించిన కుంజా వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. దమ్మపేట గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఐ నాయకుడు యార్లగడ్డ భాస్కరరావును పరామర్శించి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, అత్తులూరి వెంకటరామారావు, పర్వతనేని ప్రసాద్, పగడాల రాంబాబు, కుమార్, గోపిశాస్త్రి, చినబాబు పాల్గొన్నారు.

జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ-2లో ప్రైవేట్ పనులు నిర్వహించే హిందుస్థాన్ ట్రేడ్ ఓవర్సీస్ కంపెనీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హిందుస్థాన్ కంపెనీ కార్మికులతో 12గంటల పాటు పని చేయించుకుంటూ వారి శ్రమను దోపిడీ చేయడం దుర్మార్గమన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఆదెర్ల ఉపేందర్, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, అవినాష్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్డీ నాయకుడు సతీష్

చర్ల: ఏజెన్సీ మండలాలకు కూడలిగా ఉండి నిత్యం అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్న చర్ల మండలంలో ప్రభుత్వం వెంటనే అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ చర్ల దుమ్ముగూడెం మండలాల సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని లింగాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడిగా అగ్ని మాపక కేంద్రం కోసం ఈ ప్రాంత ప్రజానీకం ఎన్ని పోరాటాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వస్తున్నాయని ఆయన ఆరోపించారు. దీంతో వందలాది ఇళ్లు దగ్గమవుతుండడం, లక్షలాది రూపాయల ఆస్తులు కాలిపోవడం జరుగుతోందని ఆయన అన్నారు. చర్లకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న భద్రాచలం నుంచి అగ్నిమాపక శకటం వచ్చే లోపు ఇక్కడ ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే సర్వం నాశనం అవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్లలో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాధ, కమల, దేవి, శ్రీలేఖ, చిరంజీవి, నర్సింహారావు, చంటి, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.52 వేల నగదు స్వాధీనం

అశ్వారావుపేట(ములకలపల్లి): మండల పరిధిలోని అనందపురం శివారులో మంగళవారం 52 వేల రూపాయల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ టీం (ఎఫ్ఎస్‌టీ) స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎటువంటి ధృవపత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు టీం అధికారి మోతీలాల్ తెలిపారు.

రామయ్య భక్తులకు అన్నదానం

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణంలోని శాతినగర్ కాలనీలో ఏర్పాటు చేసి అన్నదాన కార్యక్రమాన్ని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ మంగళవారం ప్రారంభించారు. దూర ప్రాంతాల నుంచి భద్రాద్రి రామయ్య కల్యాణం వీక్షించేందుకు వచ్చే భక్తుల కోసం దాసరి వెంకటనారాయణ-హారతి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రాసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో తాళ్ళపల్లి రమేష్ గౌడ్, హరీష్, చిన్ను పాల్గొన్నారు.

ఒకేరోజు మూడు కాన్పులు

గుండాల: ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ దవకాణాలో రోజుకో, వారానికో ఒక కాన్పు జరుగుతుంది. కానీ ఆదివారం రాత్రి ఆళ్లపల్లి ప్రభుత్వాస్పత్రిలో ఒకేరోజు మూడు సాధారణ కాన్పులు జరిగాయి. ఈ మేరకు వైద్యాధికారి రేవంత్ వివరాలను వెల్లడించారు. గత ఏడాది ఒకే రోజు మూడు కాన్పులు జరుగగా.. మళ్లీ ఈ ఏడాది ఒకే రోజు మూడు కాన్పులు జరినట్లు తెలిపారు. తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని, వారికి కిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వైద్య సిబ్బందిని అభినందించారు.

ఘనంగా ఉత్సవ మూర్తుల సంప్రోక్షణ

అశ్వారావుపేట(ములకలపల్లి): మండలపరిధిలోని మాధారం గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో సీతారామ చంద్రస్వామి ఉత్సవమూర్తుల సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయాన్ని బోడపట్ల బూశమ్మ, ముత్తయ్య దంపతులు నిర్మించారు. ఆలయానికి సీతా, రామ, లక్ష్మణ, అంజనేయస్వామి విగ్రహాలను ఊకంటి వాణిశ్రీ, గోపాల్‌రావు దంపతులు అందజేశారు. ఆలయ పూజారి విస్సావఝ్ఝల సురేశ్ శాస్త్రి, దెందులూరి కృష్ణమోహన్ శర్మ, నాగరాజు శర్మల ఆధ్వర్యంలో వాణిశ్రీ. గోపాల్ దంపతులచే మంగళవారం శాస్త్రోక్తంగా సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు చేయించారు. ఊకంటి వెంకట్రావు, అన్నవరపు శ్యామ్, ఊకంటి జగదీశ్, ప్రభాకర్‌రావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలి

చర్ల: ఆదివాసీలు సేకరించే ప్రతీ 50 ఆకుల తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. మంగళవారం చర్లలోని సీపీఐ పార్టీ కార్యలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తునికాకు సేకరణ పనులను త్వరితగతిన చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ, పార్టీ మండల కార్యదర్శి నూపా పోతయ్య, నాయకులు తిరుపతిరావు, రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలను జయప్రదం చేయాలి

గుండాల: ఉపాధిహామీ కూలీల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 20 వరకు గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు జరిగే ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఏఐకెఎమ్ఎస్ జిల్లా అధ్యక్షుడు భట్టు ప్రసాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, సారంగపాణిలు పిలుపునిచ్చారు. ఆళ్లపల్లిలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బత్తిని సత్యం, తోట వీరభద్రం, ఉప్పయ్య పాల్గొన్నారు.

భద్రాద్రి సేవలు చిరస్మరణీయం

అశ్వారావుపేట(ములకలపల్లి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఈర్ల భద్రాద్రి సేవలు చిరస్మరణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. మండలపరిధిలోని జగన్నాథపురంలో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించన భద్రాద్రి 5వ వర్ధంతి సభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎండి.యూసఫ్, ఎస్‌కె.జబ్బార్, రవి, వెంకటరమణ, రామ్మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల్లో బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే తాండ్ర వినోద్‌రావును గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్ కోరారు. మంగళవారం అశ్వారావుపేటలో పార్టీ మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ అధ్యక్షత జరిగిన మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

చంద్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మండలస్థాయి క్రికెట్ పోటీలను కాంగ్రెస్‌పార్టీ మండల నాయకుడు సారేపల్లి శేఖర్ మంగళవారం ప్రారంభించారు. భోజ్యానాయక్, చాపలమడుగు రామరాజు, నర్సింహారావు, ప్రసాద్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.